తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 1 : గ్రామీణ ప్రాంతాల్లో నెల కొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మిషన్‌భగీరథ అధికారులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మిషన్‌భగీరథ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గట్టు మండలంలోని పలు గ్రామాలకు మిషన్‌భగీరథ నీటి సరఫరా కాక ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అందుకు స్పందించిన అధికారులు రెండు మూడు రోజుల్లో నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు. అంతకు ముందు గద్వాల మిషన్‌భగీరథ నూతన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. సమావేశంలో మిషన్ భగీరథ అధికారులు శ్రీధర్ రెడ్డి పరమేశ్వర్, రవి చంద్ర నాయకులు విజయ్‌కుమార్, రాజశేఖర్ మిషన్‌భగీరథ ఏజెన్సీ నిర్వాహకుడు మోహన్ పాల్గొన్నారు.

ముస్లింలకు స్థలం కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

వనపర్తి టౌన్,అక్టోబర్ 1 : ముస్లింలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ అధికారులు మసీదుకు స్థలాలను ఇవ్వాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు జిల్లా అధికారులను కోరారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్వగృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి రోడ్ల విస్తరణ సందర్భంగా రోడ్లపై ఉన్న మసీదులు, ఆలయాలకు ప్రత్యామ్నాయంగా స్థలాలను కేటాయిస్తామని గతంలో మున్సిపల్ తీర్మానం చేశారన్నారు, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థలాలు కేటాయించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. సమావేశంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు జోహేబ్, ఇమ్రాన్, రహీం, జమీల్, గౌస్, సయ్యద్, వహిద్, పాషా తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు కిట్ల పంపిణీ

కిట్లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్

పెబ్బేరు, అక్టోబర్ 1 : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు మంగళవారం పాలకవర్గం శానిటేషన్ కిట్లను పంపిణీ చేసింది. కార్యాలయంలో జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రె స్వామి, కమిషనర్ ఆదిశేషు కార్మికులకు పీపీఈ కిట్లు, గ్లౌసులు, సబ్బులు, నూనె వంటి వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మీరాజ్ అహ్మద్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ యోగేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మండల విద్యార్థులు

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కేటీదొడ్డి, అక్టోబర్ 1 : గత నెల 18 వ తేదీన కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబర్చిన మండలంలోని పాతపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు తరుణ్, రాఘవేంద్ర జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌మురళి, క్రీడా శిక్షకుడు విజయ్‌వర్మ తెలిపారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు బీహార్ లని బుద్ధగయలో జరిగే జాతీయ స్థాయి 43 సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఈ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్ర సేనారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పూడ్చిన శవానికి రీపోస్టుమార్టం

గుర్రంగడ్డలో పూడ్చిన శవానికి రీపోస్టుమార్టం చేయడానికి వచ్చిన అధికారులు

గద్వాల రూరల్, అక్టోబర్ 1 : మండలంలోని గుర్రంగడ్డంలో పూడ్చిన శవానికి మంగళవారం రీ పోస్టుమార్టం చేసిన ఘటన చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి వివరాల ప్రకారం గుర్రంగడ్డ గ్రామానికి చెందిన జగన్నాథ్‌రెడ్డి(55) జీవనోపాధి నిమిత్తం 20ఏండ్ల కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లారు. హైదరాబాద్‌లోని చంపాపేటలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ నివాసం ఉండేవాడు. గత నెల 27వ తేదీన ఆయన ఆకస్మాత్తుగా మృతిచెందడంతో స్వగ్రామానికి తీసుకొచ్చి 28వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. అయితే అతడి ఒంటిపై గాయాలు ఉండటంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి కూతురు సౌమి కథ్రెడ్డి 29వ తేదీన హైదరాబాద్‌లోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా మంగళవారం పూడ్చిన శవానికి వైద్యురాలు ఝాన్సీ, తాసీల్దార్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో రీ పోస్టుమార్టం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బాలకృష్ణారెడ్డి, గ్రామస్తులు తదితరులుఉ పాల్గొన్నారు.

జగన్నాథ్‌రెడ్డి (ఫైల్)

నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, అక్టోబర్ 1: ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కళాశాల వసతులకు అనుగుణంగా జీప్లస్ వన్ నిర్మాణం పూర్తిచేయాలని, తరగతి గదులు, ల్యాబ్‌లు మొదలైనవి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. నిర్ధేశిత ప్రమాణాల ప్రకారం గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అంతకు ముందు పాత ఎస్పీ కార్యాలయం, గంజిపేటలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను పరిశీలించి అన్ని తరగతులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. నర్సింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాలలో 300మంది విద్యార్థులు ఉన్నారని ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాత ఎస్పీ కార్యాలయంలో ఉంటుండగా ఫస్టియర్ విద్యార్థులు గంజిపేటలో ఉంటున్నారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రిన్సిపాల్, సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు కలెక్టర్ ఇచ్చారు. కొత్త నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం కొన్ని నెలల్లో పూర్తవుతుందని అప్పటి వరకు కొత్త బ్యాచ్ నర్సింగ్ విద్యార్థులకు గంజిపేటలో తాత్కాలికంగా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తయ్యాక అన్ని మౌలిక వసతులతో కూడిన కొత్త భవనంలోకి విద్యార్థులను తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హన్మంతమ్మ, అధికారులు జైపాల్‌రెడ్డి, సురేశ్, రహీమ్‌ఖాన్, శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

నూతన నర్సింగ్ కళాశాల పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

శరన్నవరాత్రి ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

అలంపూర్,అక్టోబర్ 1 : అలంపూర్ క్షేత్రంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఆయా శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని శాఖల వారీగా సూచించారు. శాని టేషన్, తాగునీరు, క్యూలైన్లు, వీఐపీల దర్శనాలు, ప్రోటోకాల్ నిర్వహణ, విద్యుత్, వైద్యం, నది వద్ద గత ఈతగాళ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెప్పోత్సవం, నదీ హారతి కార్యక్రమాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలోఆర్డీవో రాంచందర్, ఆలయ ఈవో పురేందర్‌కుమార్, తాసీల్దార్ మంజుల పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

గద్వాల అర్బన్,అక్టోబర్ 1 : వృద్ధులతో గౌరవంగా మెలగాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి గంట కవితా దేవి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు వారి తల్లిదండ్రులకు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తే వారి పోషణ నిమిత్తం జిల్లాలోని ఆర్డీవో లేదా జిల్లా సంక్షేమ శాఖ అధికారి, తాసీల్దార్ కార్యాలయంలో వారిపై దరఖాస్తు చేసుకోవాలని లేదా నేరుగా కోర్టు కు దరఖాస్తు చేసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగ రావు, లక్ష్మీ నారాయణ, ఆర్డీవో రాంచందర్, ఇన్‌చార్జి డీడ బ్ల్యూవో సుజాత, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ వినోద్ ఉన్నారు.

పెబ్బేరులో వృద్ధులను సన్మానిస్తున్న విద్యార్థులు

పెబ్బేరు మండలంలో..

పెబ్బేరు, అక్టోబర్ 1 : మండలంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం యాపర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అవ్వ, తాతలకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శంకర్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను గౌరవించాలని, వారు అనుసరించిన మార్గంలో నడవాలని చెప్పారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైనొద్దీన్, వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, బాలమ్మ, శ్రీధర్, ఇందిరమ్మ, కవిత, శివాని పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంటా కవితాదేవి

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రవల్లి చౌరస్తా అక్టోబర్1 : రేషన్ బియ్యం పట్టుకొని కేసునమోదు చేసిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు మంగళవారం ఉదయం సివిల్ సప్లై, ఇటిక్యాల పీఎస్ సిబ్బంది కలిసి జింకలపల్లి గ్రామ శివారులోని పద్మావతి శ్రీనివాస్ రైస్ మిల్లులో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 51క్వింటాళ్ల అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై అధికారి మహర్షి ఫిర్యాదు మేరకు రైస్‌మిల్ యజమాని చల్లా ప్రకాశ్‌పై కేసున మోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సెలవుల్లో బడులు నిర్వహిస్తే చర్యలు

అయిజ, అక్టోబర్ 1 : ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో బడులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో రాములు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్ఎంలను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో ఎంఈవో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి దసరా, సంక్రాంతి, రెండో శనివారం, ఆదివారం, పబ్లిక్ సెలవు రోజుల్లో బడులు నిర్వహించినట్లు తెలిస్తే విద్యాశాఖ చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలన్నారు. డ్రైవర్లకు అనుభవంతోపాటు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. ఒత్తిడిలేని విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

రైతు భవిష్యత్‌కు విత్తనమే కీలకం

పెద్దమందడి, అక్టోబర్ 1: ఆరుకాలం కష్టపడే అన్నదాత భవిష్యత్‌కు విత్తనమే కీలకమని అందుకని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వేరుశనగ, శనగ, కందులు, మినుములు కాకుండా తెలంగాణలో రైతుల నుంచి సేకరించి తెలంగాణ సీడ్స్‌ను మాత్రమే కొనాలని జిల్లా సీడ్స్ అధికారి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అల్వాల గ్రామంలో రైతులకు ఆయన అవగాహన కల్పించారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు తక్కువ ధరలలో అందిస్తుందని గుర్తుచేశారు. తెలంగాణ వాతావరణానికి అనుగుణంగా రైతులకు అధిక దిగుబడులను ఇచ్చే పంట రకాలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుందని వివరించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సీడ్స్ కార్యాలయం వద్ద విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీడ్స్ మేనేజర్ శేఖర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెద్దమందడి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, కొండన్న, కృష్ణారెడ్డి, సాయన్న, దశరథం, రాజు, రాములు, చిన్న అంజన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సీడ్స్ అధికారులు

24 గంటల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరికి రిమాండ్

కేటీదొడ్డి, అక్టోబర్ 1 : 24 గంటల్లో చోరీ కేసును కేటీదొడ్డి పోలీసులు ఛేదించారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని యర్సన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం పట్టపగలే నాలుగు ఇండ్లలో ఎవరూ లేని సమయంలో చింతలకుంట గ్రామానికి చెందిన కుర్వ మహేశ్, కుర్వ ఆంజనేయులు ఇండ్ల తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై సోమవారం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేయగా ఇద్దరి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం తామే చేసినట్లుగా ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి లక్ష రూపాయలు రికవరీ చేసి వారిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 24 గంటల్లో దొంగతనం కేసును ఛేదించినందుకు ఎస్సై శ్రీనివాసులుతో పాటు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

వనపర్తి బాలికల పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

కేటీదొడ్డి : గువ్వలదిన్నె పాఠశాలలో బతుకమ్మలను ఎత్తుకున్న విద్యార్థినులు

గద్వాల జిల్లా కేంద్రంలో విద్యార్థులతో బతుకమ్మ ఆడుతున్న జడ్జి గంటా కవితాదేవి

ఆత్మకూరు డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల బతుకమ్మ సంబురాలు

గోపాల్‌పేట బాలికల ఉన్నత పాఠశాలలో బతుకమ్మ చుట్టూ బొడ్డెమ్మ ఆడుతున్న ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు

గట్టు : బలిగేర పాఠశాలలో బతుకమ్మతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్ర సంస్కృతిలో భాగంగా నేటి నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు, అధ్యాపకురాళ్లు వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను తయారు చేసి వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడి సందడి చేశారు. వివిధ

మదనాపురం జెడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

బతుకమ్మలను నెత్తిన పెట్టుకున్న విద్యార్థులతో ధరూరు జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు

మల్దకల్ : పాల్వాయిలో బతుకమ్మలతో విద్యార్థులు

శాంతినగర్‌లోని శ్రీ కృష్ణ చైతన్య పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

పాఠశాలల్లో అందంగా అలంకరించిన బతుకమ్మలకు నిర్వాహకులు పోత్రాసాలను సహితం అందజేశారు. అనంతరం బతుకమ్మలను ర్యాలీగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

శేషంపల్లిలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకులు

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల పర్యటన

మల్దకల్, అక్టోబర్ 1 : మండల కేంద్రంలో త్వరలో నిర్వహించే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని శేషంపల్లి, చర్లగార్లపాడు, నీలిపల్లి తదితర గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలను కలిసి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. అలాగే ప్రభుత్వ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయని అడిగి వారికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే మండల కేంద్రంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంపై వారితో చర్చిస్తూ దానిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దెలబండ శేఖర్, తిరుమల్ నాయుడు, తిరుమలేశ్, తిమ్మప్ప, నాగరాజు, పరశురాముడు, ఆంజనేయులు, రంగ స్వామి, తిరుపతి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎంపిక

వీపనగండ్ల, అక్టోబర్ 1: టీఎస్‌పీఆర్‌టీయూ జిల్లా ఎన్నికల ప్రతినిధి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పీఆర్‌టీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల కమిటీ అధ్యక్షుడిగా కందూరి ఆనంద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌గౌడ్ ఉపాధ్యక్షుడిగా ఖాసీం, అసోసియేట్ కార్యదర్శిగా శ్రీనివాసులు మహిళా కార్యదర్శిగా శ్వేతను ఎంపిక చేసినట్లు పీఆర్‌టీయూ సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెబ్బేరు, అక్టోబర్ 1 : మహిళలపై దాడులు, సైబర్ నేరాలపై మంగళవారం పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి షీ టీమ్, భరోసా బృందాలు విద్యార్థులకు వివిధ నేరాలపై వివరించారు. సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపాల్ భద్రసేన్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బ్యానర్లు పట్టుకొని ప్రదర్శన నిర్వహించారు.

వనపర్తి డిపో నుంచి ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్,అక్టోబర్ 1 : వనపర్తి డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ 40వేల కిలోమీటర్ల మేరకు బస్సులు నడుపుతున్నామని దసరా సెలవుల దృష్ట్యా అదనంగా హైదరాబాద్ నుంచి వనపర్తికి పది ట్రిప్పులు నడుపుతున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు వాహనాలు నడుపుతామని తెలిపారు.

అందుబాటులో సంచార వైద్యం

జిల్లా ఘనపురం, అక్టోబర్ 1: పశువులకు సంచార వైద్యం అందుబాటులో ఉందని, పశువుల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సురేశ్ అన్నారు. మండలకేంద్రంలోని పాడి పశువులకు సంచార వైద్యంతో మంగళవారం ఉచితంగా వైద్యసేవలు అందజేశామని తెలిపారు. పశువులకు రోగాలు వస్తే రైతులు 1962 కాల్ చేసి బుక్ చేసుకుంటే పశువులకు వైద్యం అందజేస్తామన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

మల్దకల్ , అక్టోబర్ 1 : దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 3నుంచి 12వ తేదీ వరకు ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగరాజు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. 3న వాసవీమాతాను బాల త్రిపురా సుందరి దేవీగా , 4న ధాన్యల క్ష్మీదేవీగా, 5న వేంకటేశ్వరస్వామిగా, 6న లలితా దేవీగా, 7న అన్న పూర్ణ దేవీగా, 8న ఉదయం రాజరాజేశ్వరి దేవీగా, సాయంత్రం ధనలక్ష్మి దేవీగా, 9న సరస్వతి దేవీగా, 10న దుర్గాదేవీగా, 11న ధనలక్ష్మి దేవీగా, 12న నిజరూప అలంకరణలో వాసవి మాత దర్శనం ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం వేద పండితులతో ప్రత్యేక హోమాలు, సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 3వ తేదీ ఉదయం కలశస్థాపన, ధ్వజ స్థాపన, వినాయక పూజ, అమ్మవారికి అభిషేకంలతో దసరా నవరాత్రులు మొదలు కానున్నట్లు తెలిపారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్, అక్టోబర్ 1: డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలకేంద్రంలో ఆశకార్యకర్తలతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే, యాంటీ లార్వా ఆపరేషన్ చేసి నిల్వ నీటిలో అబ్బేట్ ద్రావణాన్ని కలపాలని సూచించారు. గర్భిణుల నమోదు, హైరిస్కు కేసులు, రక్తహీన గుర్తించి మండల కేంద్రంలో వైద్యాధికారి సమక్షంలో రక్తపరీక్షలు చేయించాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో రామయ్య, వైద్యాధికారులు తారశశాంక్, మైథిలి, నిహారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ

మల్దకల్, అక్టోబర్ 1 : మండలంలోని పెద్దొడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎంఈవో సురేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సురేశ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ దసరా సెలవులను వినియోగించుకోవాలని, సెలవుల్లో చదవడం, రాయడంలో నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు నాగరాజు, పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

జిల్లా ఘనపురం, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని శివాల యానికి తన వంతు సాయంగా ఆగారం ప్రకాశ్, లచ్చిరెడ్డి మంగళవారం ఆలయ భజన బృందానికి రూ.35 వేల విలువ గల మైక్‌సెట్‌ను వితర